ప్రజాశక్తి
సోమవారం 4 నవంబరు, 2024
5
శ్రీకాకుళం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించనున్నట్లు సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పది గంటల నుంచి గిరిజనుల సమస్యలపై వినతులు స్వీకరించనునట్లు పేర్కొన్నారు. జిల్లాలోని గిరిజనులందరూ తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

వంట కార్మికులపై వేధింపులు ఆపాలి

- 11న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని, అనేకచోట్ల రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగిస్తున్నారని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి తెలిపారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, కొత్త మెనూను విద్యార్థికి రూ.20 చొప్పున పెంచిన తర్వాతనే అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 11వ తేదీన శ్రీకాకుళం నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ధర్నాలో వంట కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో యూనియన్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కార్మికులపై వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు నిర్దాక్షిణ్యంగా రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారని విమర్శించారు. మానసికంగా వేధిస్తున్న పరిస్థితి ఉందన్నారు. మరోవైపు పథకం అమలుకు పాఠశాలలో పిల్లలకు ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటమ్‌తో గత ప్రభుత్వం లాగే ప్రభుత్వం కూడా తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఈ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50వేల మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో ఎక్కువగా ఒంటరి మహిళలే ఉన్నారని చెప్పారు. వీరి ఉపాధికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నా ఎలాంటి ప్రమాద బీమా సౌకర్యం లేదన్నారు. అనేక పాఠశాలల్లో ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవని చెప్పారు. పథకం అమలుకు పాఠశాలలో పిల్లలకు ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటమ్‌తో గత ప్రభుత్వ మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు అనుగణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్‌ను సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలైన వంట షెడ్లు మంచినీరు తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు దట్టి జమ్మాలు, ఈశ్వరి, లక్ష్మి బెహరా, ముత్యాలమ్మ, పార్వతి, బి.జానకి, చంద్రమ్మ, ఉమాదేవి, రాజేశ్వరి, బి.ఢిల్లమ్మ, కోకిల, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

కా.రా మాస్టారు శత జయంతి సెమినార్‌లో పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

మాట్లాడుతున్న పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరంతో పాటు భావితరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కాళీపట్నం రామారావు శత జయంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళం సాహితీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఫ్రాన్స్ వంటి దేశాలు ఇప్పటికీ వారి మాతృభాషను వాడుక భాషగా వినియోగిస్తూ ఇంగ్లీష్‌ను దరిచేరనీయడం లేదని చెప్పారు. 10 కోట్ల మంది తెలుగు వారున్నా, తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగ కథల రచనల్లో కా.రా మాస్టారు సరళమైన వాడుక భాషను వినియోగించి అందరికీ అర్థమైన రీతిలో అందించారని గుర్తుచేశారు. కా.రా మాస్టారు శతజయంతి సందర్భంగా విశాఖ నగరంలో రెండు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తునామని, కవులు, రచయితలు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కా.రా మాస్టారు అనేక కథలు రాసి తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. తెలుగు భాషపై ఆయనకున్న శ్రద్ధ, సమాజంపై ఉన్న అంకితభావం నేటితరానికి ఆదర్శమన్నారు. ఆయన నెలకొల్పిన కథానిలయం కథలకు భాండాగారంగా నిలిచిందన్నారు. వ్యయప్రయాసల కోర్చి లక్ష రచనలను ఒక్కచోటుకు చేర్చి నేటి తరం చదువుకునేందుకు వీలుగా భద్రపరిచిన తీరు సాహిత్యంపై ఆయనకున్న మక్కువకు తార్కాణమన్నారు. కథానిలయాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేసి రచనలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని మాట్లాడతూ ధనం కంటే జ్ఞానం గొప్పదని, అందుకే కా.రా మాస్టారు జ్ఞాన సంపన్నుడిగా నిలిచారన్నారు. ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ కా.రా మాస్టారు విభిన్న కోణాల్లో కథలను సృశించారని కొనియాడారు. తొలుతకా.రా మాస్టారు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రముఖ రచయిత చీకటి దివాకర్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో కా.రా మాస్టారు రచనలు, కథలపై రచయితలు, ఉపాధ్యాయులు దుప్పల రవికుమార్, కంచరాన భుజంగరావు, మల్లిపురం జగదీష్, డా.కె.ఉదయ్‌కిరణ్, ఎ.మోహనరావు, బాడాన శ్యామలరావు, బాలసుధాకర మౌళి, చింతాడ తిరుమలరావు, పూజారి దివాకర్ పత్ర సమర్పణ చేశారు. కా.రా మాస్టారు కుమారుడు కె.సుబ్బారావును ఎమ్మెల్యే సత్కరించారు. విశ్వసాహితీ అధ్యక్షులు పొన్నాడ వరహానర్సింహులు, రాజాం రచయితల వేదిక అధ్యక్షులు గార రంగనాథం, సాహితీ స్రవంతి సంస్థ అధ్యక్షులు కె.శ్రీనివాసు, గంట్రేడు గౌరునాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటు

- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు
- శ్రీకాకుళం నగరం చుట్టూ రింగ్ రోడ్డుకు ప్రతిపాదన
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇసుక నుంచి ముఖ్య ఖనిజాలను వేరు చేసే టైటానియం కాంప్లెక్స్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వంశధార ప్రాజెక్టు పూర్తి చేయడం, వంశధార, నాగావళి నదుల అనుసంధానం పూర్తి చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వంశధార ఫేజ్-2, స్టేజ్ 2 పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 19 టిఎంసిల నీటిని నిల్వ చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం నూతన డిపిఆర్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పలాస మండలం కేదారిపురం వద్ద మూడు కిలోమీటర్ల పైప్‌లైను వేసి పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు మంచినీటిని అందిస్తామన్నారు. బాహుదా నదిపై పలు కీలక పనుల కోసం రూ.30 కోట్లు అవసరమన్నారు.

రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ

నరసన్నపేట జమ్ము జంక్షన్ నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. కళింగపట్నం-పార్వతీపురం రోడ్డు, బత్తిలి- అలికాం రోడ్డు జాతీయ రహదారుల సంస్థ పరిధిలోకి వెళ్లేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. డోల- పోలాకి-నౌపడ రోడ్డు అభివృద్ధికి జాతీయ రహదారి సంస్థ నిధులు అడిగినట్లు తెలిపారు. శ్రీకాకుళం నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన కూడా చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ 'ప్రసాదం' ప్రాజెక్టు ద్వారా అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. టెంపుల్ సర్క్యూట్ టూరిజం అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో డచ్ బంగ్లా చుట్టూ పర్యాటన ప్రాజెక్టులను రూపొందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఆమదాలవలస - శ్రీకాకుళం రోడ్డు నిర్మాణం కోసం రూ.5.5 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. మరో రూ.10 కోట్లు విడుదల చేసి మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

గిరిజన గ్రామాలకు మహర్దశ

ఎమ్మెల్యే కూన రవికుమార్

బూర్జ : కూటమి ప్రభుత్వంతోనే గిరిజన గ్రామాల రహదారులకు మహర్దశ పడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. వైసిపి ప్రభుత్వంలో ఎంతో ఆర్భాటంతో ఈ ప్రాంతాల్లోని పలు రహదారుల నిర్మాణం పనులను ప్రారంభించి చివరికి రాళ్లు తేలిన రహదారులుగా మార్చారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో ఎక్కడా ఆయా గ్రామాల ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, సర్పంచ్ కొరికాన వెంకట సీతారామరాజు, గిరిడ శ్రీనివాసరావు, అంపిలి గణపతిరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి నందిగాం

సీతారామరాజు ఏకపాత్రలో శంకరరావు

యుటిఎఫ్ జిల్లా స్వరణోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమారస్వామి, గణపతిరావుల ఆధ్వర్యాన ఆదివారం సాంస్కృతిక పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ మండలాల నుంచి 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలు ఏకపాత్ర అభినయనంలో కర్ణ పాత్రలో పి.దుర్యోధనరావు, అల్లూరి సీతారామరాజు పాత్రలో బాలక శంకరరావు, పల్లెటూరు చున్నాడు పాత్రలో యు.గణపతిరావులు సాధించారు. జానపద నృత్యాలు పురుషుల విభాగంలో బి.చిన్నారావు, మహిళల విభాగంలో ఎస్.మాధవి, ఎల్.త్రివేణి, అభ్యుదయ గీతాల్లో బి.పూర్ణిమ, పి.వి.రమణమూర్తి, పి.షణ్ముఖరావులు మొదటి రెండు స్థానాలు సాధించారు జానపద గేయాల విభాగంలో ఆర్.చిరంజీవి, ఎ.భాస్కరరావు, మహిళా విభాగంలో పి.వనిత అయ్యా విభాగాల్లో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. పద్య విభాగంలో ఎ.భాస్కరరావు, నీలకంఠేశ్వరరావు, మిమిక్రీ విభాగంలో ఎం.నారాయణమూర్తి, పి.షణ్ముఖరావు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డి.ఎ.స్టాలిన్, ఎం.తాతయ్య, కె.కామేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ.చిచాన్నారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.దాయ్య, పి.ధర్మారావు, జిల్లా సాంస్కతిక విభాగపు కన్వీనర్ సిద్దు టి.వైకుంఠరావు, పాల్గొన్నారు.

త్వరితగతిన కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం

- ప్రాత్రునివలసలో 33 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, నరసన్నపేట

కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీస్ చైర్మన్ ఎ.రవినాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రునివలసలో 33 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఖేలో ఇండియా పథకంలో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. నాలుగు ప్రత్యేక సింథటిక్ స్పోర్ట్స్ మైదానాలు నిర్మిస్తున్నామన్నారు. కీడా వికాస ప్రాంగణాలు పూర్తి చేస్తామన్నారు. జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి కరణం మల్లేశ్వరి సహాయాన్ని కోరామన్నారు. జిల్లా క్రీడాభివృద్ధికి ఆమె సమయాన్ని వెచ్చిస్తామని చెప్పారని తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలు ఉన్నాయని, వారికి అక్కడే అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ చేయాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని చెప్పారు. రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం, శాప్, విద్యాశాఖల సమన్వయంతో అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. కోడి రామ్మూర్తి స్టేడియంను మల్టీపర్పస్ స్టేడియంగా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, డిఎస్‌డిఒ శ్రీధర్, డిఇఒ తిరుమల చైతన్య, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మినీ ఇండోర్ స్టేడియం అభివద్ధికి కృషి

మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శాప్ చైర్మన్ రవినాయుడుతో కలిసి నరసన్నపేటలోని ఇండోర్ స్టేడియంను ఆదివారం పరిశీలించారు.

స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి, శాప్ చైర్మన్ రవి నాయుడు

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలు, పిక్నిక్ స్పాట్లకు వెళ్లేందుకు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో పంచారామాల క్షేత్ర దర్శిని ప్రత్యేక బస్సుని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ అమరసింహుడు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచారామ క్షేత్రాలైన అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీరరామలింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కుమారరామ భీమేశ్వరుడు) క్షేత్రాలను సందర్శించడానికి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 10, 17, 24 తేదీల్లో సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకాకుళం బస్ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. పంచారామ క్షేత్రాల సందర్శన అనంతరం మంగళవారం తెల్లవారుజామున శ్రీకాకుళం చేరుకుంటాయన్నారు. శ్రీకాకుళం నుంచి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీకి రూ.2,400, అల్ట్రా డీలక్స్ రూ.2,350, ఎక్స్‌ప్రెస్ రూ.రెండు వేలు టిక్కెట్‌గా నిర్ణయించినట్టు తెలిపారు. టిక్కెట్లను apsrtconline.in వెబ్‌సైట్‌లో గానీ డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చన్నారు. ప్రత్యేకంగా బస్సును బుక్ చేసుకునే వారికి వారు కోరిన ప్రదేశానికి బస్సు పంపిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం ఒకటో డిపో 9959225608, రెండో డిపో 9959225608, పలాస డిపో 7382921647, టెక్కలి డిపో 9959225609 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, స్టేషన్ మేనేజర్ శ్రీను, ఎం.వి రావు, ఒపిఆర్ఎస్ సూపర్‌వైజర్ బాషా పాల్గొన్నారు.

48 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పలాస

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు గంజాయి రవాణా చేస్తుండగా రైల్వే పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి రూ.5 లక్షలు విలువైన 48 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సిఐ రవికుమార్, ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. స్థానిక పద్మనాభపురం కాలనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శివంకుమార్చౌదిరి, బదాయిమహాపాత్రో, సాహిబ్కుమార్చౌదిరిలు ఆరు నెలల క్రితం వ్యాపారం నిమిత్తం వచ్చారని అన్నారు. వారు పగలంతా ఒడిశా రాష్ట్రం వెళ్లి గంజాయి పండించే రైతులకు నగదు ఇచ్చి వారితో గంజాయి ఆంధ్రా బోర్డర్ వరకూ రప్పించుకునే వారని తెలిపారు.

రాత్రులు ఇంటికి తీసుకొచ్చి రైలు ఎక్కించి బిహార్, మహారాష్ట్ర, కర్నాటక, రాష్ట్రాలకు తరలిస్తూ... అక్రమంగా డబ్బులు సంపాదించుకునే వారని అన్నారు. ఈ క్రమంలో వారు ఒడిశా రాష్ట్రంలోని ఆర్.ఉదయగిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసుకొని పలాస మీదుగా ముంబాయికి తరలించేందుకు బ్యాగులతో రైలు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో రైల్వే ప్లాట్‌ఫారంపై ఆ ముగ్గురు వ్యక్తుల బ్యాగులతో అనుమానస్పదంగా సంచరించడంతో పోలీసులకు అనుమానం వచ్చి వారి బ్యాగులు తనిఖీ చేశారని అన్నారు. ఈ సమయంలో వారు పరారయ్యేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. దీనిని గమనించి పోలీసులు వారిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. వారి బ్యాగుల్లో రెండు కిలోలు చొప్పున మొత్తం 48 కిలోల గంజాయి లభించిందన్నారు. నిందితులను అరెస్టు చేసి విశాఖపట్నం రైల్వే కోర్టులో సోమవారం హాజరుపరుస్తామని తెలిపారు.

గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కక్షసాధింపులకు దిగితే సహించం

మాజీ మంత్రి అప్పలరాజు

పోలీసులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వ నేతలు రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగితే సహించబోమని, మా వైసిపి కార్యకర్తలను కాపాడుకుంటామని మాజీ మంత్రి, వైసిపి డాక్టర్ల సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కొండపల్లికి చెందిన వైసిపి కార్యకర్త మడ్డు జస్వంత్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేయడంపై మండిపడ్డారు. తమ కార్యకర్తలను వదిలే వరకు ఇక్కడే ఉంటానని ఎస్ఐ నిహార్‌కు స్పష్టం చేశారు. ఈ నెల 1న నువ్వలరేవులో పింఛన్లు పంచుతుండగా... జైనపల్లి దానమ్మ అనే మహిళ క్యూలో నిల్చొని ఒమ్మసిల్లి పడిపోయిందని, హుటాహుటిన ఆస్పత్రికి తరలించడంతో ప్రానాపాయ స్థితి నుంచి బయటపడడం అందరికీ తెలిసిందేనని అన్నారు. అయితే దానమ్మకు జరిగిని ఇబ్బందిని మడ్డు జస్వంత్ సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకోవడంతో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆదివారం పోలీసుకలు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో పోలీసులు ఆగమేఘాల మీద స్పందించి జస్వంత్‌ను అదుపులోకి తీసుకోవడంపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కుపల్లిలో మృతుల పరామర్శలో ఉండగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అప్పలరాజు మండలంలోని వైసిపి కార్యకర్తలతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐతో మాట్లాడారు. వాస్తవాలు తెసుకోకుండా విచారణ చేయకుండా జస్వంత్‌ను అదుపులోకి తీసుకోవడం ఏమిటని ఎస్ఐను ప్రశ్నించారు. అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని, దాడులను పోత్సహించి గ్రామాల్లో తగాదాలు సృష్టిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో చిచ్చుపెట్టొద్దని, నువ్వలరేవులో ఏం జరిగిందో మీకు తెలియదా ? అని మోహనరావును పోలీస్‌స్టేషన్‌లో నిలదీశారు. పింఛన్లు పంపిణీలో దానమ్మ స్పృహ కోల్పోవడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పోస్టింగ్ చేసినంత మాత్రనా జస్వంత్ ఇంటికి వెళ్లి భయాందోళనకు గురిచేయడమేంటని నిలదీశారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతి చేరుకుని 15 నిముషాలను విచారణ చేపట్టి వదిలేస్తామని మంత్రి వివరించారు. విచారణ అనంతరం జస్వంత్‌ను విడిచిపెట్టారు. విషయమై ఎస్ఐను వివరణ కోరగా, వచ్చిన ఫిర్యాదు మేరకు జస్వంత్‌ను విచారణకు పిలిచామని తెలిపారు. ఎలాంటి కేసూ నమోదు చేయలేదని తెలిపారు. అప్పలరాజు వెంట మండల ప్రత్యేకాహ్వానితులు ఎం.ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశవరావు, పలాస మాజీ ఎంపిపి బి.హేమేశ్వరరావు, ఐరోతు హేమంత్రాజు, దువ్వాడ ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఉన్నారు.

సముద్ర తీరంలో బందోబస్తు ఏర్పాటు

మెరైన్ సిఐ రమేష్ కుమార్

రమేష్‌కుమార్

సోంపేట: కార్తీక మాసం వనభోజనాలు, సముద్ర స్నానాలు, సందర్శకుల భద్రత దృష్ట్యా తీర ప్రాంతంలో బారువా మెరైన్ పోలీసుల ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు బారువ మెరైన్ సిఐ డి.విజె. రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు మెరైన్ పోలీసులు చేసిన సూచనలు, హెచ్చరికలు పాటించి సహకరించాలన్నారు. యువత, ఆకతాయిలు, మద్యం సేవించి సముద్రంలో దిగరాదన్నారు. సెల్ఫీల కోసం, ఈత కోసం సముద్రంలోకి దిగడం చేయరాదన్నారు. మహిళలు ఒంటరిగా ఉండకుండా తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలు విద్యార్థులను తీసుకొచ్చి వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పజెప్పినంత వరకు బాధ్యత తీసుకోవాలన్నారు. బారువా, పుక్కల్లపాలెం, రట్టి, సెగళ్లపుట్టుగ బీచ్‌ల్లో బందోబస్తుస ఏర్పాటు చేశామని తెలిపారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోడ్ల సమస్యపై నిరసన

ప్రజాశక్తి- కొత్తూరు

హిరమండలం మండలం పెద్దగూడ ఆదివాసీ గిరిజన పంచాయతీలో పాండ్రమానుగూడ, బలదగూడ గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించి ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పాండ్రమానుగూడ ఆదివాసీ గిరిజన గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. తదనంతరం రోడ్డు సమస్యపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఈ రెండు గ్రామాల రోడ్డు సమస్యపై గతంలో ప్రభుత్వ అధికారులకు, ఐటిడిఎ అధికారులకు, ఎమ్మెల్యేలకు తెలియజేశామని, అయినా స్పందన లేదని వాపోయారు. గిరిజన గ్రామాలను ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వానికి తగదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సవర రమేష్, సవర బాలయ్య, సవర కమలమ్మ, కుమార్, లక్కమ్మ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో దీర్ఘాశికి చెందిన మెండ శ్రీనివాసరావుకు మబగాం క్యాంపు కార్యాలయంలో రూ.3,61,500 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసరావు చిన్నతనం నుంచి టిడిపిలో ఉంటూ ఆరోగ్య పరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్‌కు దరఖాస్తు చేసుకోగా... మంజూరైందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిలిండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ

ప్రజాశక్తి- పాతపట్నం

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి పేదలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని దువ్వార వీధిలో ఆదివారం ఉచిత గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, సిర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని సత్కరిస్తున్న బెంతు ఒరియాలు

ఎమ్మెల్యే చొరవ అభినందనీయం

ప్రజాశక్తి- కవిటి

బెంతు ఒరియాల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే అశోక్ చూపించిన చొరవ అభినందనీయమని టిడిపి పార్లమెంటరీ పార్టీ ఎస్‌టి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ బిసాయి అన్నారు. ఈదుపురంలో ఇటీవల జరిగిన దీపం -2 పథకం సభలో బెంతు ఒరియాల సమస్యను ఎమ్మెల్యే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సిఎం బెంతు ఒరియాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, తక్షణమే వారికి నేటివిటీ ధ్రువపత్రాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీనికి కృతజ్ఞతగా శనివారం రాత్రి నెలవంక పంచాయతీకి చెందిన బెంతు ఒరియాలు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. నెలవంక మాజీ సర్పంచ్ కృష్ణ బిసాయి, సత్యనారాయణ దళాయి, మోహన్ బిసాయి, కెత్రో బిసాయి పాల్గొన్నారు.

విశాఖ స్కూల్‌లో స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్

పరిశీలిస్తున్న డాక్టర్ గీత

శ్రీకాకుళం అర్బన్: స్థానిక బ్యాంకర్స్ కాలనీలో గల సాయి ప్రియదర్శినీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడపబడుచున్న విశాఖ స్కూల్‌లో ఎస్ఎల్‌సి (స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్) ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తమ పిల్లల ప్రాజెక్టులను చూడటానికి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా ఉదయం 08.30 గంటలకు విశాఖ స్కూల్‌కి చేరుకున్నారు. అందరి ప్రాజెక్టులను చూసి చాలా బాగా చేశారని, విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ బాగున్నాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ పాఠశాల చైర్మన్ డా. మధు సూదన్, వైస్ చైర్మన్ గీత హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు టీచర్స్‌గా మారి తాము నేర్చుకున్న పాఠాలు తల్లిదండ్రులతో పంచుకున్నారు. ఇలాంటి కార్యక్రమం విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీస్తుందని, భయాన్ని పోగొట్టి భవిష్యత్‌లో విజయాలు అందిస్తుందని చైర్మన్ మధు సూదన్ అన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్య ప్రదర్శన, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేయడం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ వలన సాధ్యమవుతుందని హెచ్ఎం పి.రామారావు అన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

లావేరు: ఈనెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లావేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతాయని ప్రతి విద్యార్థి వారోత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు కోరారు. ఆదివారం శాఖా గ్రంథాలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాలకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. అలాగే విద్యార్థుల తల్లి దండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తామన్నారని తెలిపారు.

నేడు ప్రజా వారధి

రణస్థలం రూరల్: నేడు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వారధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలపై వినతులు అందించవచ్చన్నారు.

గణిత ప్రతిభా పరీక్ష ప్రశాంతం

టెక్కలి : ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పాతపట్నం: గణిత ఉపాధ్యాయులు ఫోరం కన్వీనర్ రేగటి మధుసూదనరావు ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని 8, 9, 10 తరగతుల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్షను ఆదివారం నిర్వహించారు. ముందుగా పరీక్షా ప్రశ్నాపత్రాలను ప్రధానోపాధ్యాయులు ఎస్.వైకుంఠరావు, పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి అమర జనార్ధనరావు మాస్టారు ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులు 58 మంది, 9వ తరగతి విద్యార్థులు 43 మంది, ఎనిమిదో తరగతి విద్యార్థులు 45 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంకడాల గోవిందరావు, కె.అప్పారావు, జి.గోవిందరావు, ఎస్.రామారావు, ఎన్.మన్మథరావు, ఎస్.లక్ష్మణరావు, పి.శంకరరావు, పి.భవాని, వై.సుందరమ్మ, పి.బాబూరావు, జె.గణపతిరావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఆదివారం మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్షను వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ హై స్కూల్-ప్లస్‌లో నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 194 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి ఐదు మంది విద్యార్థులకు జిల్లాస్థాయి పరీక్షకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు మండల ప్రతినిధులు చింత ఉమారావు, గోపాల కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో మండల గణిత ఉపాధ్యాయులు కిరణ్, సురేష్‌కుమార్, శంకరరావు, ప్రకాష్, గిరి, పాపారావు, ఆనందరావు పాల్గొన్నారు.

టెక్కలి : ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యాన స్థానిక ఉన్నత పాఠశాలలో గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులు 140 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డొంకాన పాపారావు, కొండవీటి ఆచ్యుతరావు, స్వర్ణలత, నరేష్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని మెట్టూరు, కుంటిభద్ర, నివగాం, మాతల, కడుం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కెజిబివి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షను ఎంఇఒ ఎన్.శ్రీనివాసరావు, స్థానిక హెచ్ఎం డి.గోవిందరావు, మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మీనరసింహంలు ప్రారంభించారు. ఈ పరీక్షకు 140 మంది విద్యార్థులు పాల్గొన్నారని గణిత ఉపాధ్యాయులు వేదిక కో-ఆరిడ్నేటర్ దండు ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు బాలరాజు మహంతి, ఎల్.గోవర్ధనరావు, జె. తిరుపతిరావు, ఎం.కొండయ్య, కె.మాధవరావు, జి. భాస్కరరావు, టి.కళావతి, పి.రామరాజు, కె. మల్లిఖార్జున రావు, ఎం.శాంతారావు, పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

కొత్తూరు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పొందూరు: మండలంలోని వావిలిపల్లిపేట ఎపి మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షల్లో 22 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతులకు చెందిన 127 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని ఎం.వినీష, కింతలి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి కె.తేజేశ్వరరావు, తాడివలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి మెట్ట లక్ష్మీనారాయణ భట్లు ప్రథమస్థానంలో నిలిచారు. ఈ పోటీల నిర్వాహకులుగా తేజేశ్వరరావు, సూర్యలక్ష్మి, హరిప్రసన్న శ్రీనివాసరావు, కృష్ణారావు, రమేష్, మురళీ మోహన్, వెంకట సత్యనారాయణ వ్యవహరించారు.

మాట్లాడుతున్న ప్రసాదరావు

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈనెల 9,10 తేదీల్లో పలాసలో నిర్వహించనున్న సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు పోలాకి ప్రసాదరావు, కె.సూరయ్య పిలుపునిచ్చారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం రాజీలేని పోరాటాలు సిపిఎం చేస్తుందన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దళిత, గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి- కవిటి

సమగ్ర శిక్షా అభియాన్ హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తానని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆదివారం కేంద్రమంత్రికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రమేష్, ఆనంద్, అజిత్ పాడి తదితరులు పాల్గొన్నారు.

స్వర్గధామాన్ని ప్రారంభిస్తున్న జగన్మోహనరావు

స్వర్గధామం నిర్మాణం

ప్రజాశక్తి- పొందూరు

తల్లి జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోవాలని చేసిన ఆలోచన వినూత్నంగా ఉంది. తల్లి జ్ఞాపకార్థం పలు రకాల విరాళాలు ఇచ్చిన వారిని చూశాం. జీవిత చరమాంకంలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా చివరి నిమిషంలో కట్టే కాల్చేందుకు పలువురు పడుతున్న ఇబ్బందులు గమనించిన గ్రామస్తుడు స్వర్గధామానికి షెడ్డును నిర్మించి తన దాతృత్వం చాటుకున్నాడు. తన తల్లి జ్ఞాపకార్థం స్వర్గధామం నిర్మించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని బొడ్డేపల్లికి చెందిన రామకృష్ణారావు తల్లి లక్ష్మి మృతి చెందడంతో ఆమె గ్రామంలో వారందరికీ జ్ఞాపకం ఉండేలా స్వర్గధామం నిర్మించాడు. స్వర్గధామాన్ని గ్రామానికి అంకితం చేశాడు. ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జగన్మోహన్‌రావు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డేపల్లి రమణ, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యం, దుప్పల గోవిందరావు, తిర్లంగి మాధవరావు రామకృష్ణారావును అభినందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మెళియాపుట్టిలో పారిశుధ్య పనులు ఆదివారం నిర్వహించారు. కాలువలను శుభ్రం చేస్తూ చెత్తను తొలగించారు. బోర్, వెల్‌ప్లాట్ ఫారం దగ్గర వీధుల్లో, కూడళ్లలో ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చింతల అప్పారావు, సర్పంచ్ ప్రతినిధి వాసు, ఉప సర్పంచ్ మాడుగుల భానోజీరావు, బసవ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోడ్డు పనులు వేగవంతానికి కృషి చేస్తామని సర్పంచ్ ప్రతినిధి పిట్టా మామయ్యరెడ్డి అన్నారు. మండలంలోని మండపల్లి పంచాయతీ బుడ్డిపుపేట శ్మశానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తిప్పన కూరయ్య, జామి మామయ్యరెడ్డి, పురుషోత్తంరెడ్డి, వార్డు మెంబరు కొరాయి నూకయ్య, సచివాలయ ఇంజినీర్ పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో వంద అత్యాచారాలు

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మాట్లాడుతున్న శాంతి

పాతపట్నం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల్లో వంద అత్యాచారాలు చోటు చేసుకున్నాయని, విషయంపై సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత్ సిగ్గుపడాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరిపై ఎక్కువ కేసులో ఉంటే వారికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నతమైన పదవులు ఇస్తామని విమర్శించారు. అందువల్లే కీచకులు ఏ మాత్రం భయపడకుండా ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో ఆడపిల్లలపై నీచంగా మాట్లాడితే తాట తీస్తామని డైలాగులు చెప్పిన నాయకులు ఇప్పుడు శాంతిభద్రతలు కరువయ్యాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏదో చోట మహిళలపై నిరంతరాయంగా హత్యలు, అఘాయిత్యాలు జరుగుతునే ఉన్నా... పాలకులు స్పందించకపోవడం సరికాదన్నారు.

మాట్లాడుతున్న సిఐ మంగరాజు

సైబర్ నేరాలపై అప్రమత్తం

సోంపేట: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ మంగరాజు హెచ్చరించారు. సోంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తెలియని ఫోన్ కాల్స్ ఆన్సర్ చేయకపోవడం మంచిదని అన్నారు. అలాగే ఎవరైనా లింక్ పంపిస్తే వాటిని ఓపెన్ చేయకూడదని సూచించారు. సోంపేటలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం సిబ్బందిని ముఖ్య కూడళ్ల వద్ద నియమించామన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు బయటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చైన్ స్నాచర్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బయట ప్రదేశాలకు వెళ్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈయనతో పాటు ఎస్ఐ హైమావతి ఉన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నలుగురు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అభినందిస్తున్న నాయకులు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఇద్దరు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సాధించారు. ఈ నెల 8న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో భూపాల్‌లో జరుగుతున్న 68వ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కె.రేవంత్‌రెడ్డి అండర్-78 కేజీ కేటగిరి, నీలాపు భగవాన్ అండర్-51 కేజీ కేటగిరి, అంతర్ యూనివర్సిటీ సెలెక్షన్స్‌లో అక్టోబరు 30న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహించిన ఎంపికలో ఇచ్ఛాపురానికి చెందిన ఎ.భువనేశ్వరి అండర్-53 కేజీ కేటగిరి, ఉప్పాడ అను అండర్-65 కేజీ కేటగిరిలో ఎంపికైంది. ఈ నెల 12 నుంచి 15 వరకు పంజాబ్ రాష్ట్రంలోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ అమృత్సర్‌లో జరగబోయే అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తైక్వాండో మాస్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిలక విజయ భాస్కరరెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ చాట్ల తిరుపతి, టిడిపి పట్టణ కార్యనిర్వహణ కార్యదర్శి బత్తిన కృష్ణయ్య, గోల్డ్ మర్చంట్ చెన్నూరు మధుకుమార్, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి దక్కత సుమన్‌రెడ్డి, ఎల్.సి.రావు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు చిన్నారి మధు, దక్కత సుమన్‌రెడ్డి, ఎల్.సి.రావు ఆర్థికసాయం అందజేశారు.

వైసిపికి పూర్వవైభవం తీసుకొస్తాం

గోవిందరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులందరి కృషితో వైసిపి పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని వైసిపి సీనియర్ నాయకుడు కోట గోవిందరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో వైసిపి నాయకులు, అభిమానులు, ఆత్మీయుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా కేకును కట్ చేసి గోవిందరావు అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు ఎన్ని జరుపుకున్నా వైసిపి కార్యకర్తలు, అభిమానులు అందరూ ప్రజా సమస్యలపై సంఘటితంగా పోరాటం చేసి రానున్న రోజుల్లో వైసిపి విజయానికి కృషి చేయాలన్నారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం నాలుగు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గోవిందరావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రమశిక్షణతోనే విద్య సాధ్యం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

డాన్సులు చేస్తున్న విద్యార్థినులు

విద్యలో చక్కగా రాణించాలన్నా, ఉజ్వల భవిష్యత్ పొందాలన్నా విద్యతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమని వెంకట సాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు అన్నారు. ఆదివారం సరుబుజ్జిలిలోని విద్యాసంస్థల ఆవరణలో ఇంటర్మీడియట్ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. యువత అన్ని రంగాల్లో ప్రతిభను చాటి దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో సందడి చేసి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు అభినందన

అభినందిస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం: ఈ నెల 5 నుంచి 7 వరకు నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు అండర్-19 విభాగంలో గోవింద్ బెహరా, తరుణ్ బెహరా, సాగర్ బెహరా, రాజు బెహరా, నిరాకర్ బెహరాలు ఎంపికయ్యారు. వీరికి స్థానిక సురంగి రాజా క్రీడా మైదానం ఆవరణంలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్ ప్రతినిధులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రయాణ ఖర్చుల నిమిత్తం అలయన్స్ క్లబ్ సభ్యులు బత్తుల వెంకటరమణ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ సభ్యులు బి.గోపి, సిహెచ్.లోహిదాస్, మురళీధర్, దక్కతో సుమన్, నరసింహ మూర్తి, ఉమాశంకర్, వెంకటరమణ, ఎల్ఐసి బుజ్జి పాల్గొన్నారు.

మహిళ అదృశం

విజయలక్ష్మి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక గ్రామానికి చెందిన ఎండ విజయలక్ష్మి అనే మహిళ అదృశ్యం అయినట్లు లావేరు ఎస్ఐ గదుల లక్ష్మణరావు తెలిపారు. విజయలక్ష్మి ఎచ్చెర్లలోని ప్రైవేట్ కళాశాలలో ఆయాగా పనిచేస్తూ రోజు మాదిరిగానే గతనెల 23న ఉదయం 8 గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగిరాకపోవడంతో ఆమె భర్త ఎండ కుమార్ ఆదివారం లావేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్త కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.


గుమిగూడిన స్థానికులు

అనుమానాస్పద వ్యక్తుల సంచారం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని చింతలగార సమీపంలోని ఖాళీ స్థలంలో శనివారం పదుల సంఖ్యలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించారు. దీంతో స్థానికులు గుమిగూడారు. అయితే వాళ్ల ఎవరు, ఏమిటీ అని పలువురు స్థానికులు ప్రశ్నించడంతో వారినుంచి పొంతనలేని సమాధానాలు రావడంతో వీడియోలను స్థానికులు సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. అయితే వారు ఎవరు అనే దానిపై పోలీసులు పరిశీలిస్తున్నారు.

కుక్కలను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

కుక్కలు ఏరివేత

టెక్కలి రూరల్ : టెక్కలి పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో సంచరిస్తున్న కుక్కలను సిబ్బంది ఆదివారం ఏరివేశారు. కొద్ది నెలల నుంచి పంచాయతీ వీధుల్లోని కుక్కలు ప్రజలకు పలు ఇక్కట్లకు గురిచేశాయి. చాలాచోట్ల కుక్కలు ప్రజలపై, వాహనదారులపై భౌతిక దాడులకు పాల్పడడంతో చాలామంది గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. వీధుల్లో కూడా కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేయడంతో భయాందోళన చెందారు. కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు పలుమార్లు అధికారులను కోరారు. టెక్కలి పంచాయతీ కార్యదర్శి కె.వి.వి. జగన్నాథం ఆధ్వర్యాన కుక్కలను పట్టుకునే చర్యలకు పాల్పడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

20న నీటిసంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఈనెల 20న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. ఇప్పటికే ఆయా సంఘాల పరిధిలో ఓటర్ల జాబితాలు తయారు చేయడం జరిగిందన్నారు. ఈనెల 3 నుంచి 13 వరకు ఓటర్లు నమోదుపై అభ్యంతరాలుంటే తెలియపర్చాలన్నారు. ఓటర్లు జాబితా గ్రామ సచివాలయల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈనెల 20న ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. మండలంలోని 42 రెవెన్యూ గ్రామాలుండగా 18 గ్రామాల్లో రీసర్వే గతంలో జరిగిందని, వీటిలో తప్పులు సవరణకు గ్రామసభల ద్వారా వినతులు స్వీకరించి పరిష్కరించడం జరుగు తుందన్నారు. మండలంలోని 14 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిన కారణంగా ప్రభుత్వం నిషేధాన్ని విధించిందని, ఆయా గ్రామాల్లో ఫారం-3 కొత్తగా బోరు బావులు వేయడం నిషేదమన్నారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు.

శిష్టకరణాలను ఒబిసిలో చేర్చాలి

ప్రజాశక్తి- పొందూరు

ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన శిష్టకరణాలను తక్షణమే ఒబిసి జాబితాలోకి చేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల శిష్టకరణ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పొందూరు, జి.సిగడాం మండలాల శిష్టకరణ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. గతంలో ప్రస్తుత కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఎంపీగా ఉన్న సమయంలో శిష్టకరణాలను ఒబిసిలో చేర్చాలని పార్లమెంటులో కోరారని, ప్రస్తుతం రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నారని, ఆయన చొరవ తీసుకొని ఒబిసి జాబితాలోకి మార్చేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పొందూరు, జి. సిగడాం మండలాల శిష్టకరణ వనభోజనం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వి.రామోదరరావు, కె.రవికుమార్, వి.నిరంజన్. వి.ఉమ, కె.సతీష్, మన్మథరావు తదితరులున్నారు.

నేర నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సిఐ ఈశ్వరరావు

విధి నిర్వహణలో సమన్వయం పాటించాలని, ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరించాలని, తద్వారా క్రైమ్‌రేట్‌ని తగ్గించే ప్రయత్నం చేయాలని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సిఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రకాల క్రైమ్‌లు జరుగుతూ ఉంటాయని, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల వైపుగాని, అసాంఘిక కార్యక్రమాల వైపుగాని వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని, ఫిర్యాదుదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో విశాఖపట్నంలో పలు పోలీస్ విభాగాల్లో సిఐగా పనిచేసి, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన సిఐ ఈశ్వరరావుకు ఎస్ఐలు, సిబ్బంది అభినందించారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ఎమ్మెల్సీ 'దువ్వాడ' పరామర్శ

కోటబొమ్మాళి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పలువురు మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీ, వైసిపి నాయకులు దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. మండలం పట్టుపురానికి చెందిన బల్లి లక్ష్మీనారాయణ, సోమనాథపురానికి చెందిన పిట్ట వాసు, కిష్టుపురానికి చెందిన కొనారి వరలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు కిష్టుపురం ఎంపిటిసి బొడ్డు చెంచులు, తాటిపర్తి సర్పంచ్ లక్ష్మణ, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు చేస్తున్న తులసీవరప్రసాదరావు

విస్తృతంగా టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి- కొత్తూరు

విస్తృతంగా టిడిపి సభ్యత్వం నమోదు చేస్తున్నామని టిడిపి నాయకులు, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలందరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మీనారాయణ కొయిలాపు సంజీవరావు, లోతుగెడ్డ భగవాన్ నాయుడు, సవర ఫాల్గుణరావు పాల్గొన్నారు.

చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని చిన్నబగ్గా గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను దత్తత అధికారి, ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయుడు శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. లెక్కలు ఫిజిక్స్ సబ్జెక్టులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్ఎం శ్రీనివాసరావుకు ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. శతశాతం వచ్చేటట్లు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ముందుకు తీసుకురావాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. డిసెంబర్ నెలాఖరికి 10వ తరగతి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈయన వెంట డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

4న మన్యం ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో సోమవారం ఈనెల 4న ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత మన్యం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు. దీని అనుమతి కోసం పాలకొండ డిఎస్‌పి రాంబాబును కలిసి అనుమతి కోరారు. హై స్కూల్ నుండి ఐటిడిఎ వరకు గిరిజన సమస్యలపై మన్యం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతిని ఇచ్చిన వారిలో వైస్ చైర్మన్ బిడ్డిక శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బిడ్డిక ఉమామహేశ్వరరావు, సవర చిరంజీవి, మండంగి విశ్వనాధం, బిడ్డిక రామారావు, కొండగొర్రి భాస్కరరావు, సవర మోహన్ పాల్, బిడ్డిక రాము తదితరులు పాల్గొన్నారు.

రబీ డ్రై షోయింగ్‌కి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేట క్లస్టర్ యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన సిబ్బంది రబీ సీజన్‌లోకి రైతులకు కావాల్సిన విత్తనాలను సిద్ధం చేసినట్లు డిజిటల్ ఎల్ టు సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో అపరాలలో అంతర పంటలకు అవసరమైన విత్తనాలను సమకూర్చడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా రైతులు రబీ సీజన్‌లో అపరాలు వేస్తుంటారని, అందులో అంతర పంటలుగా కట్టె జనుము, మొక్కజొన్న, గోరు చిక్కుడు, బెండ, గోంగూర విత్తనాలను వరుసలలో, అలాగే పొలం చుట్టూ వేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో రబీ డ్రై షోయింగ్ వేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, జానకిరామ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలంలోని తమ్మినాయుడుపేట యూనిట్ మెట్టపేట గ్రామంలో 170 ఎకరాలకు రబీ సీజన్‌లో అంతర్ పంటలు వేసుకునేందుకు విత్తనాల ప్యాకెట్లను తయారు చేశారు. ఎకరానికి 1.850 గ్రాముల విత్తనాలు చొప్పున ప్యాకెట్లు తయారు చేయడం జరిగిందని యూనిట్ ఇన్‌ఛార్జి చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలా ప్రతి రైతు వేసుకోవడం వలన అదనపు ఆదాయం వస్తుందని, జీవ వైవిధ్యం పెరుగుతుందని, చీడపీడలు దరిచేరకుండా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో మాధవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : విత్తన ప్యాకెట్లను తయారు చేస్తున్న సిబ్బంది

ఇంజినీర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షునిగా కెసిహెచ్ మహంతి ఎన్నికయ్యారు. ఆదివారం జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగిన ఎన్నికల్లో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షులు కె.రవీంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబు, సంయుక్త కార్యదర్శి చంది నాయుడులు హాజరయ్యారు. రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల కాలం పాటు పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న ఇంజినీర్లు అనేక ఇబ్బందులు పడ్డారని, విజిలెన్స్, ఇతర ఏజెన్సీల తనిఖీల పేరిట ఐదేళ్ల పాటు కంటిమీద కునుకు లేకుండా చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంజినీర్లపై సానుకూలంగా స్పందించి అనేక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కళ్యాణ్‌లు ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించా లన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షునిగా పోలినాయుడు, కార్యదర్శిగా పోలి నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.రమేష్, సలహాదారునిగా పూర్వపు అధ్యక్షులు పల్లి నర్సింహులు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

'జైభీమ్' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని జైభీమ్ సేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా దేవరాజును, కంచిలిశాఖ గౌరవాధ్యక్షుడుగా నూతలపాటి బాబూరావు, ఉపాధ్యక్షుడుగా జి.జగ్గారావు, సోంపేటశాఖ గౌరవాధ్యక్షుడిగా దూసి మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలకు, ఆశయాలకు అనుగుణంగా తమ సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.ఈశ్వరరావు, ఎస్.మోహనరావు, డి.వెంకటరావు, జి.ప్రకాశరావు, అచ్యుత్, బుద్దేస్, నారాయణరావు, ధర్మారావు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఎండల మల్లన్న ఆలయం ముస్తాబు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఎండల మల్లన్న పెద్దదైన స్వయంభూ శివలింగం కలిగిన శైవక్షేత్రం. ఆ ఆలయం కార్తీకమాసం మొదటి సోమవారానికి యాత్రికులు దర్శించుకునేందుకు సర్వం సిద్ధమైంది. ఏటా కార్తీకమాసం నాలుగు వారాల పాటు వేలాదిగా ఇక్కడికి యాత్రికులు వస్తారు. అలాగే శివరాత్రి కూడా స్వయంభూలింగం దర్శనానికి పోటెత్తుతారు. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచీ యాత్రికులు వస్తుంటారు. శ్రీకాకుళం నగరానికి 55 కిలోమీటర్ల దూరంలో గల రావివలస చేరుకునేందుకు రవాణా సదుపాయం ఉంది. టెక్కలికి కూతవేటు దూరంలో ఉండే ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు నడుస్తుంటాయి. ఆలయానికి సుమారు 3 కిలోమీటరు నడిచి చేరుకోవాల్సి ఉంటుంది. కార్తీకమాసం ఉత్సవాలకు ఆలయం ఇఒ గురునాథరావు ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తి చేశారు. సిఐ అంబటి విజయకుమార్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎండల మల్లన్న ఆలయం

రోడ్డు పక్కన ఉన్న చెత్తా చెదారం

మళ్లీ మెదటికే...

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పాలశీతలీకరణ కేంద్రం పక్క ఉన్న మార్గంలోనే అక్కడి ప్రజలు మరలా రోడ్డుపైనే చెత్త వేయడంతో ఆ ప్రాంతీయులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు, వాహనాలు తిరుగాడే మార్గం కావడం అక్కడే చెత్త వేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఇక్కడ ఇదే పరిస్థితి ఉండడంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటన నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించి చెత్తా చెదారాలను తొలగించారు. మరలా పరిస్థితి మెదటికే రావడంతో అక్కడి ప్రజానీకం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఈ మార్గంలో ఉన్న చెత్తను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిరణ్‌కుమార్

సిఎంను కలిసిన కిరణ్‌కుమార్

టెక్కలి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల జిల్లాలో పర్యటించారు. దీంతో జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవ కిరణ్ సిఎంను కలిశారు. పార్టీలో కూటమి ప్రభుత్వం విజయానికి జనసేన సహక రించిన విజయావకాశాలపై చర్చించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు.

పరామర్శిస్తున్న కృపారాణి

కృపారాణి పరామర్శ

కోటబొమ్మాళి: కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దాట్ల లింగమూర్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి కొత్తపేటలోని లింగమూర్తి స్వగృహానికి వెళ్లి ఆయనను ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని కాసేపు ముచ్చటించారు. వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు కిల్లి రామ్మోహనరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రామకృష్ణ, మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ షేక్ రాజు, మాజీ సర్పంచ్ గడ్డవలస నాగభూషణరావు, రమేష్, హరీష్ ఉన్నారు.

వీరభద్రరావు విగ్రహావిష్కరణ

పాతపట్నం : మండలంలోని తిడ్డిమికి చెందిన ఎఎంసి మాజీ చైర్మన్ కొంచాడా వీరభద్రరావు విగ్రహాన్ని వైసిపి మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లిపురం సర్పంచ్ ఏనుగుతల సూర్యం, బోరుభద్ర సర్పంచ్ సవిరిగాన శ్రీనివాసరావు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి గోకవలస రాము, తూర్పుకాపు సంఘ జిల్లా నాయకులు టి.సుధాకర్, మాజీ సర్పంచ్ ఆర్.బాబూరావు, పిన్నింటి ఫాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.